క్లుప్తంగా

నీటి వృథా



పైప్‌లైన్ దెబ్బతినడంతో వృథాగా పోతున్న తాగునీరు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీలో తాగునీరు వృథాగా పోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం స్థానిక ప్రజలు మాట్లాడుతూ మాధవరం–1 గ్రామ పంచాయతీలోని వెంకటేశ్వరపురం రామాలయం వద్ద తాగునీటి పైప్‌లైన్ డ్యామేజ్ కావడంతో 4 రోజులుగా నీరు వృథాగా పోతున్నాయన్నారు. దీంతో పైప్‌లైన్‌లోకి మురుగునీరు పోతున్నాయన్నారు. ఆ నీరు తాగుతుంటే విషజ్వరాలు వస్తున్నాయని ఆ ప్రాంత ప్రజలు తెలిపారు. సంబంధిత అధికారులు తాగునీరు వృథాగా పోకుండా పైప్‌లైన్ మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి లక్ష్మీనరసయ్యను వివరణ కోరగా వెంకటేశ్వరపురం గ్రామంలోకి పెద్ద పెద్ద వాహనాలు వెళ్లడం వల్ల తాగునీటి పైప్‌లైన్ డ్యామేజ్ అయిందని, సమస్యను పరిష్కరిస్తామని ఆయన వివరించారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

రాయచోటి అర్బన్ : క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని టీడీపీ నేత బోనమల ఖాదర్‌వలీ అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 27 వరకు రాయచోటిలో నిర్వహించే జిల్లాస్థాయి క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల కరపత్రాల విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు దాదాపుగా చదువుకే పరిమితం అవుతున్నారన్నారు. చదువుతోపాటు క్రీడలపై తప్పక దృష్టిని సారించాలన్నారు. ఆటల పోటీలలో పాల్గొనడం వలన మానసిక ఒత్తిడిని జయించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, నేతలు రఘుపతి, విజయ్, వాసుదేవనాయక్, కుమార్‌నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిష్ట హోమాలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని పగడాలపల్లిలో కోదండరామాలయ ప్రతిష్ఠా మహోత్సవం రెండవరోజు ఆదివారం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. 108 కలశాలు స్థాపించి యాగశాలలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అలాగే నేడు సోమవారం గ్రామోత్సవం నూతన విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

చిట్వేలి : మండలకేంద్రంలోని మంగళంపల్లి రోడ్డులో కమ్మారాయుడు స్వామి ఆలయం సమీపంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి నూతన శిలా బింభ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలియజేశారు. ఈ కార్యక్రమం ఈనెల 19న (నేడు సోమవారం)తో ప్రారంభమై 21వ తేదీ బుధవారంతో ముగుస్తుందన్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ట, 20న స్వామివారి గ్రామోత్సవం నెల్లూరు ధనమ్మ బృందంచే కోలాటం, 21న బుధవారం ఉదయం 4.30 గంటల నుంచి యంత్ర ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, 11 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. ప్రతిరోజూ అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ధర్మకర్త రామ్మోహన్ నాయుడు కోరారు.

రచయిత శ్రీరామదాసు పద్మనాభయ్యకు సన్మానం



పద్మనాభయ్య దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

పుల్లంపేట : కవి, రచయిత శ్రీరామదాసు పద్మనాభయ్య శ్రీ గౌరీదేవీ గొబ్బెమ్మ పాటలు, భావనారాయణ సరస్వం, మంచి మాటల మణిహారం, శాంతిలింగేశ్వర స్తోత్రం, నక్షత్ర మాల తదితర సూక్తి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ఎస్‌బీవీడీ విద్యాసంస్థల కరస్పాండెంట్ నూకల శ్రీరాములు, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పద్మనాభయ్య దంపతులను పూలమాలతో సన్మానించారు. పద్మనాభయ్య అనేక సంకీర్తనలు రచించారని, ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయుడు, రచయిత హైమావతి, శ్రీనివాసులు, నరేంద్ర, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు మునిరత్నం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి

పెనగలూరు : లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రవి ప్రకాష్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం పోలీస్ స్టేషన్ మొదలుకొని బజారులో నడుచుకుంటూ వెళ్తూ పలువురు వాహనదారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అతివేగంగా వాహనం నడిపినా, త్రిపుల్ రైడింగ్ చేసిన ఉపేక్షించేది లేదన్నారు. షాపుల ముందు రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలుపరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు.



చిరుజల్లులు కురుస్తున్న దృశ్యం

ఊరించి.. ఉసూరుమనిపించి..

జూలై మాసమంతా ఆకాశం మేఘావృతంగా వుండటం తప్పా చుక్క చినుకు పడలేదు. రోజు కారుమబ్బులు రావడం వర్షం కురుస్తుందన్న ఆశతో ఎదురుచూడడం రైతాంగానికి పరిపాటిగా మారింది. వారం రోజుల నుంచి ఎండ తీవ్రతతో పంటలు ఎండుముఖం పట్టడం, మనుషులు, పశుపక్షాదులు తల్లడిల్లాయి. అయితే ఆదివారం ఆకాశం అంతా కారుమబ్బులు కమ్ముకోవడంతో వర్షం కురుస్తుందన్న ఆశతో ఆనందపడ్డ రైతాంగానికి చిరుజల్లు కురిసి ప్రజల ఆశలను ఆవిరి చేసింది. – సంబేపల్లె



కాసేపటికే ఆకాశంలో వీడిన మబ్బులు

కరువు ఛాయలు.. తాగునీటి వెతలు

- తాగునీటి కోసం మండలవాసుల కష్టాలు
- వర్షాకాలంలోనే ఇలా ఉంటే వేసవిలో తమ పరిస్థితి ఏంటోనన్న ఆవేదనలు
- ట్యాంకర్లను సరఫరా చేస్తున్నామంటున్న మండల అధికారులు



స్కీంబోర్లలో నీళ్లు రాకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్న ఓవరహెడ్ ట్యాంక్

లక్కిరెడ్డిపల్లె మండలంలో ఆగస్టు నెలలో కరువు ఛాయలు నెలకొన్నాయి. ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. వర్షాకాలంలోనే గ్రామస్తుల తాగునీరు కోసం ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. వర్షాకాలంలోనే ఇంతటి ఇక్కట్లు ఉంటే ఎండకాలంలో నీటి కోసం మరెన్ని తిప్పలు పడాలో తెలియని దుస్థితి ప్రజల నుంచి ఎదురవుతోంది. ఇప్పటికే నీటి ఎద్దడితో పొలాలు బీడుబారాయి. రెండేళ్ల నుంచి వరణుడు పెద్దగా కనిపించపోవడంతో మండలంలో ప్రజలు దాహార్తి కోసం పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.



లక్కిరెడ్డిపల్లె టౌన్ పరిధిలోని పాత మసీదు ఏరియాలో ట్యాంకర్ల ద్వారా పట్టుకున్న నీటిని ఏర్పాటు చేసుకున్న డ్రమ్ముల్లో పోసుకుంటున్న ప్రజలు

లక్కిరెడ్డిపల్లె : మండలంలో 16 గ్రామ పంచాయతీలలో 145 పల్లెలు ఉన్నాయి. దాదాపు చాలా పల్లెలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో అధికారులు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నామంటూ అధికారులు చెప్పుకొస్తున్నారు. కొన్ని పల్లెల్లో వ్యవసాయ బోరుబావుల ద్వారా నీటిని అందజేస్తున్నామని పంచాయతీ అధికారులు అంటున్నారు. మండలంలో మొత్తం 156 చేతి పంపులతోపాటు 131 స్కీం బోర్లు ఉన్నాయని అయితే కరువు పరిస్థితులు నెలకొనడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. దీంతో బోర్లకు నీళ్లందక వృథాగా పడి ఉన్నాయి. మండలంలోని లక్కిరెడ్డిపల్లె టౌన్ పరిధిలోని కొన్ని వార్డులతోపాటు మద్దిరేవుల గ్రామం అప్పలరాజుగారిపల్లె, కుర్నూతల గ్రామం వాయల్‌రాజుగారిపల్లె, ఎగువ, దిగువ గొల్లపల్లె, చౌటపల్లె గ్రామం ఎస్సీ కాలనీ, పాళెంగొల్లపల్లె గ్రామం బురుజుపల్లె, పాళెంగొల్లపల్లె, దప్పేపల్లె గ్రామం చిన్నాగిరెడ్డిగారిపల్లె తదితర గ్రామాలలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకర్ల ద్వారా తాగు నీటి ఎద్దడి ఉన్న పల్లెలను గుర్తించి నీటిని సరఫరా చేయాలని అధికార పార్టీ నాయకులకు అంటగట్టారు. వారు ప్రజలకు నీరు సకాలంలో సరఫరా చేయకపోతుండటంతో నానా అవస్థలు ఎదుర్కొంటున్న దుస్థితి కనిపిస్తోంది. లక్కిరెడ్డిపల్లె టౌన్ పరిధిలోని 3 వార్డుతోపాటు పాత మసీదు ఏరియా ప్రాంతంలోనూ నీళ్ల లేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు.

మద్దిరేవుల గ్రామం అప్పలరాజుగారిపల్లెలో రోజుకు రెండు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు. రోజువారీగా ట్యాంకర్ రాకపోతే పశువులతో ఇబ్బందులు తప్పడం లేదని తెలియజేస్తున్నారు. చేతి పంపులు, స్కీంబోర్లు పూర్తిగా అడుగంటిపోవడంతో పంట పొలాలల్లోకి వెళ్లి బిందెలతో నీరు తెచ్చుకుంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా గ్రామాలకు నీళ్లు రావడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పలు



ట్యాంకర్ వద్ద నుండి బిందెలతో నీటిని మోసుకెళుతున్న ప్రజలు (ఫైల్)

గ్రామాల ప్రజలు వాపోయారు. ఉన్న చేతి పంపులు పాడైపోవడంతో పాటు స్కీంబోర్లు అడుగంటిపోయి నీరు రాకపోవడంతో గోరుచుట్టపై రోకలి పోటు అన్న చందంగా ప్రజలు తాగునీటి కష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు చొరవ చూపి తాగునీటి ఎద్దడిని తీర్చాలంటూ మండల ప్రజలు కోరుతున్నారు.

బోరు ఎండిపోయింది



మా ఊర్లో బోరు ఎండిపోయింది. చేతి పంపు చెడిపోయింది. నీళ్ల లేక ఇబ్బందులు పడుతున్నాం. మిగతా వారికి పశువులు ఉండడంతో నీళ్ల సరిపోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోజూ రెండు ట్యాంకర్ల ద్వారా నీరు తోలితే ఇబ్బంది ఉండదు. ట్యాంకరు ఎప్పుడు వస్తుందని కోసం ఎదరుచూస్తూ ఉండాలి. నడవలేని నాలాంటి వారి పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ట్యాంకరే రావాలి డ్రములకు నింపుకోవాలి. లేదంటే ఎక్కడికి వెళ్లలేని పరిస్థితి మాది. – మనెమ్మ, మద్దిరేవుల గ్రామం,లక్కిరెడ్డిపల్లె

డబ్బులు పెట్టి కొంటున్నాం



క్యాన్ రూ.10 పెట్టి కొనుగోలు చేసుకుంటున్నాం. పది రోజులకు ఒక్క సారి కూడా మా వీధికి నీళ్ల వదలడం లేదు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ట్యాంకర్ల ద్వారా అయినా నీళ్ల తోలి మాకు నీళ్లు అందేలా చూడాలి. లేదంటే తీవ్ర బ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు. నీళ్ల కోసం ఎక్కడికి వెళ్లి తెచ్చుకోలేని పరిస్థితి మాది. పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు మా వీధికి వచ్చి చూస్తే మా పరిస్థితి అర్థమవుతుంది. – ఎం.అన్సర్ బేగ్, 3వ వార్డు, లక్కిరెడ్డిపల్లె

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



మండలంలో నీటి సమస్య ఉన్న గ్రామాలను తక్షణమే గుర్తించి ట్యాంకర్ల ద్వారా సరఫరా అయ్యేలా చూస్తాం. మండలంలోని చాలా గ్రామాలలో ట్యాంకర్ల నీరు సరిపడకపోయిన మరిన్ని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తాం. పంచాయతీ అధికారుల పర్యవేక్షణలో నీళ్ల లేని ప్రతి పల్లెకు ట్యాంకర్ల ద్వారా నీళ్ల అందించే ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నాం. ఎక్కడైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. – కిశోర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, లక్కిరెడ్డిపల్లె మండలం

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ



శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాయచోటి

రాయచోటి టౌన్ : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచేది రాఖీ పండుగ అని రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాఖీ పండుగను పురస్కరించుకుని నియోజకవర్గంలోని ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రేమానురాగాలకు ప్రతీకగా రక్షా బంధన్ నిలుస్తుందని చెప్పారు. సోదరి ప్రేమకు పటిష్టతకు నిదర్శనంగా నిలిచే పండుగే ఈ రాఖీ పండుగన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. అలాగే మహిళలకు అన్ని రంగాలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించామన్నారు. మహిళలకు ప్రాధాన్యత కల్పించిన ఘనత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు.

రాజదండం స్థానంలో రాజ్యాంగాన్ని ప్రతిష్టించాలి

రాయచోటి అర్బన్ : నూతన పార్లమెంటు భవనంలో ప్రతిష్టించిన రాజదండం స్థానంలో భారత రాజ్యాంగాన్ని ప్రతిష్టించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్)జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.హరికుమార్, మండెం సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంటు భవనంలో రాజ దండాన్ని ప్రతిష్టించి రాచరిక వ్యవస్థను ప్రజాస్వామ్య వ్యవస్థలో తీసుకొచ్చిందన్నారు. దేశ రాజ్యాంగాన్ని మార్చేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. ఇదే డిమాండ్‌తో ఈనెల 20, 21 తేదీలలో తిరుపతిలో సదస్సును నిర్వహింప తలపెట్టామన్నారు. సదస్సు విజయవంత చేయాలని కోరారు. సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కోశాధికారి వండాడి రెడ్డిసుధాకర్ పాల్గొన్నారు.

ఎంపీ మేడాకు వినతిపత్రం సమర్పణ



ఎంపీ మేడా రఘునాథరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

రాజంపేట టౌన్ : ముస్లింల శ్మశాన వాటిక అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని ముస్లిం మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షులు జాహిద్‌అలీ ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డికి ముస్లిం మైనార్టీ ప్రతినిధులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాహిద్ అలీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు శ్మశానవాటిక మంజూరు చేయడమే కాక కొంత మేర అభివృద్ధి చేశారన్నారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగాలంటే మరింత నిధులు కావాల్సి ఉన్నందున మేడా రఘునాథరెడ్డిని కలిసి సమస్యను తెలియజేశామన్నారు. ఇందుకు ఆయన రూ.10 లక్షల నిధులు మంజూరుకు హామీ ఇచ్చారన్నారు. సమస్యను తెలిపిన వెంటనే ఆయన నిధుల మంజూరుకు హామీ ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

వైభవంగా ముత్తు మారమ్మ జాతర





అమ్మవారి పూజల్లో పాల్గొన్న రాజ్యసభ ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లెలో వెలసిన శ్రీ ముత్తు మారమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారికి మహిళలు పెద్దఎత్తున అంబళ్లను సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ ధర్మకర్త స్వామి ఏలుమల్లై ఆహ్వానం మేరకు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, రాజ్యసభ సభ్యులు (ఎంపీ) మేడా రఘునాథరెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారిని శాలువా, పూలమాలతో సత్కరించారు. జాతరను పురస్కరించుకుని పెద్దఎత్తున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట జెడ్పీటీసీ దాసరి పెంచలయ్య, గడికోట వెంకటసుబ్బారెడ్డి, అరిగెల సౌమిత్రి, గంపా సుధాకర్, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, నందలూరు ఉప సర్పంచ్ ఇబ్బు, ఆనాల మధుయాదవ్, మధురాజు, మహబూబ్ బాషా, నరసింహారెడ్డి, ఎముక దుర్గయ్య, యోగీశ్వర్‌రెడ్డి, అన్నం నాగేంద్ర మూర్తి, పాలగిరి సుధాకర్ రెడ్డి, పెనుబాల నాగసుబ్బయ్య, కాకిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిని అభివృద్ధి దిశగా నడిపించాలి

సుండుపల్లె : రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన రాయచోటి ప్రాంతాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి దిశగా నడిపించాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ఆదివారం ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాయచోటిని సర్వతోముఖాభివృద్ధికి బాధ్యత తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని మండిపల్లి నాగిరెడ్డి (శ్రీనివాసపురం) ప్రాజెక్టు, ఝరికోన ప్రాజెక్టులకు సాగునీటి కాలువలు, వెలిగల్లు ప్రాజెక్టుకు డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ (పంట కాలువలు)కు నిధులు మంజూరు చేయాలన్నారు. అలాగే పింఛా ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే వందశాతం సబ్సిడీతో బిందుసేద్యం ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. పాడి పరిశ్రమకు తగు విధంగా సహకారం అందించాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు.

పిడుగుపాటు బాధితులను ఆదుకోవాలి



బాధితులను ఓదార్చుతున్న ఆకేపాటి

రాజంపేట రూరల్ : భవనంపై పిడుగుపడి నష్టపోయిన బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కోరారు. మండల పరిధిలోని కె.బోయినపల్లిలో శనివారం పిడుగుపాటుకు నష్టపోయిన బొడిశెర్ల సుబ్బరాయుడు, బోగా బాలకృష్ణల కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే ఆకేపాటి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిడుగు పడిన సమయంలో రెండు ఇళ్లలో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. కానీ ఇళ్లల్లోని విద్యుత్ పరికరాలు పూర్తి స్థాయిలో పాడైయ్యాయని తెలియజేశారు. పిడిగుపడిన విషయం కలెక్టర్, సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలియజేశారు. ప్రభుత్వం వీరి కుటుంబాలను తక్షణమే ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డి.భాస్కర్‌రాజు, పి.విశ్వనాథరెడ్డి, దండు గోపి, దాసరి పెంచలయ్య, జీవీ సుబ్బరాజు, అరిగెల సౌమిత్రి, స్థానిక నాయకులు మాడా క్రిష్ణయ్య, బొడిశెర్ల శివయ్య, బోగా రాజా, పి.చిన్నవీరయ్య, ఎస్.వెంకటసుబ్బయ్య, డి.రామయ్య, నారాయణరెడ్డి, ఎంపీటీసీ ఎ.మధుబాబు, మాజీ ఎంపీటీసీ రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను ఉరితీయాలి



కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహిస్తున్న పట్టణ మైనార్టీలు తదితరులు

రాయచోటి అర్బన్ : కోల్‌కతాలో ఒక ప్రభుత్వాసుపత్రి వైద్యురాలిపై అత్యాచారం, హత్యను నిరసిస్తూ పట్టణానికి చెందిన మైనార్టీలు పెద్ద ఎత్తున కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహించారు. పట్టణానికి చెందిన అమానత్ సేవా సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి నుంచి నేతాజి సర్కిల్ వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజల ప్రాణాల పరిరక్షణకు అనునిత్యం కృషిచేసే వైద్యులకే రక్షణ లేకుండా పోవడం దారుణమన్నారు. దారుణమైన ఈ సంఘటనకు కారకులపై ప్రభుత్వం కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అమానత్ సేవా సొసైటీ అధ్యక్షుడు అతావుల్లా, సభ్యులు ఆఫ్తాబ్, జిలాన్, ముక్తియార్, ఇర్షాద్, ఇంతియాజ్, టీడీపీ నేతలు బోనమల ఖాదర్‌వలి, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణ కుటుంబానికి అండగా ఉంటాం



వెంకటరమణ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న దేవనాథరెడ్డి

చిన్నమండెం : మండల పరిధిలోని దిగువగొట్టివీడు గ్రామ వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు, సర్పంచ్ రాజమ్మ భర్త పుల్లగూర వెంకటరమణ మృతదేహానికి జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంకటరమణ కుటుంబానికి అండగా ఉంటామని దేవనాథరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆనందరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సర్పంచులు లక్ష్మీరెడ్డి, లోకేశ్వరరెడ్డి, ఎంపీటీసీ శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, విశ్వనాథరెడ్డి, హేమనాథరెడ్డి, రాజేంద్రలు పాల్గొన్నారు. అలానే పుల్లగూర వెంకటరమణ మృతి పట్ల వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి సంతాపం తెలిపారు. మంచి ఆత్మీయుడిని కోల్పోయామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.